క థ లు :

చైతన్యం

ఆర్. వి. ఆనంద్

"వాణ్ణానికి లెగు" అంది దుర్గమ్మ

గుడిసె ముందు కూర్చున్న సుందర్రావుకి భార్యమాట వినపడలేదు. గుడిసెకు పదిబారల దూరంలో వున్న పిల్లకాలవవైపు చూస్తూ అతను ఏమో ఆలోచిస్తున్నాడు. రాత్రి ఏడుగంటలు కావస్తోంది. కాలవవొడ్డున కీచురాళ్లు ఎడతెరిపిలేకుండా రొదపెడుతున్నాయి. దూరంగా పొలాల్లోంచి గొడ్లకాడ కుర్రోడెవరోపాడే "చెల్లియో—చెల్లకో" గాలిని చీల్చుకుంటూ వచ్చి మధురంగా వినబడుతోంది.

"ఏంటల్లా కూకున్నావు కూడుదింటాకి లెగమంటే?" అని రెట్టించింది దుర్గమ్మ. ఉలిక్కిపడి లేచాడు సుందర్రావు. కాళ్ళమీద ముంతతో కాపిననీళ్లు గుమ్మరించుకుని గుడిసెలోకొచ్చి కూర్చున్నాడు దుర్గమ్మ అల్యూమినియం గిన్నె అతనిముందు పెట్టింది. ఆ గిన్నెలో మూడు గుప్పిళ్ల అన్నం మెతుకులతోపాటు వేయించిన వుప్పుచేపముక్కా, నాలుగు మెత్తళ్ళూ వున్నాయి.

"ఏంరా అబ్బాయా, సందకాడనగా వొచ్చి మూగాదేవుడులాగ కూకుండిపోయేవు?" అని అడిగింది అతనితల్లి వరసమ్మ.

"నాకేవీ పాలుపోటం లేదమ్మా" అన్నాడు సుందర్రావు గిన్నెలో వున్న మెతుకులు కలుపుతూ.

"యేం? పెసిరెంటుగారు కూల్డబ్బులియ్యలేదా? అరికుప్ప నూర్పుళ్ళియ్యాలతో ఐపోతయ్యనుకున్నారు గందా?"

"నూర్పుళ్ళయిపోయినియ్. పదేనుబళ్ళలో దాన్నెత్తి పెసిరెంటు సావిట్లో పోసేం. కూల్డబ్బు రెల్లుండిత్తాడంట" అని ఉప్పుచేప ముక్క కొరికి, "చఛ, ఇదేంటే ఈ యెండు సేపముక్క రుసీపసీలేదు" అన్నాడు కాస్త విసుగ్గా.

"ఇంటో నూనిలేదు మరి. ఏదో అడుగూబొడుగూ వుంటే [illegible] యేపేను" అంది దుర్గమ్మ.

దుర్గమ్మ యిచ్చిన జవాబుతో అతని విసుగు మాయమైపోయింది. వెంటనే అతనిదృష్టి గుడిసెలో మూలగా ముడుచుకు పడుకునివున్న తన యిద్దరు పిల్లలమీదికి మళ్ళింది. "సత్తెమ్మా, సిన్నిగాడూ తిన్నారా?" అన్నాడు

"తిన్నార్రా బాబా.... ఏంతిళ్ళో. ఉన్నకాడికి ఏగెంజో తాగుదాఁవనుకుంటే ఆ గెంజే కరువైపోయిఁది. ఏఁవిరోజు లొచ్చినియ్యిరా బగమంతుడా మీ మొగుడూపెల్లం రెక్కలు ముక్కలుజేసుకుని కస్టపడతన్నారు. ఏఁవిలాబం? పప్పుంటే వుప్పుఁడదు. ఉప్పుంటే పప్పుండదు. పోనీ నేనుగూడా అకూలిపనికెల్లి ఏదోకొంత సాయంగావుందాఁవంటే నాకేమో సత్తువులేదు .. ఈదగ్గూ ఒగురుపూ ఒకటొచ్చిపడింది నాపేణానికి" అంటూ నరసమ్మ ఆయాసపడుతోంది.

"ఇదుగో. మాకేపన్లు సరింగా దొరక్క సత్తావుంటే నిన్ను పన్లోకెల్లమని యెవరన్నారు? అసలిప్పుడెందుకీ సోది?" అని కోడలు విసుక్కుంది కాస్తబిగ్గరగా.

"నువ్వుండెహె" అని భార్యను గదమాయించి. "అమ్మా. నువ్వు పెద్దదానవైపోయేవు గందా. మాకోసఁ వింకేం దేవుళ్ళాడతావు జెప్పు. ఏదో ఆ పిల్లల్ని దగ్గిర్నే సూసుకుంటావుంటే అంతేశాన. ఒచ్చేయేటిగ్గాకపోతే ఆ పైయేటికల్లా మన సత్తెమ్మ పనుల్లోకెల్తది. అప్పుడు మనకేబాదా వుండదు" అని తల్లిని సముదాయించాడు సుందర్రావు. తన చిన్నతనంలో తండ్రి చనిపోయినప్పటినుంచి తల్లి ఎన్నికష్టాలుపడి తనను పెంచిందో అతనికి బాగాగుర్తు.

"ఏం బతుకులో" అని నిట్టూర్చి. "ఐతే పెసిరెంటు డబ్బులియ్యలేదన్నమాట" అంది నరసమ్మ.

"ఇయ్యలేదు. ఒకేళ యిచ్చినా ఈ నాలుగురోజుల కూలీ పన్నెండు రూపాలు ఏమూలకి సరిపోతై? కోవటి సేసయ్యకాట్లో తొమ్మిది రూపాల బాకీవున్నాం"

"ఇంకేం మిగుల్తాయి! ఇయ్యాల దురగమ్మ తెచ్చిన కూల్డబ్బుల్లో బియ్యానికీ, ఎండు పరిగిలకీ పోతే పావలా మిగిలింది"

సుందర్రావు మూడు గుప్పిళ్ల అన్నమూ తినేశాడు కడుపు నిండలేదు. దుర్గమ్మ మూలనున్న గెంజిదాకకోసం వెళ్ళింది. "కడుపునిండా గెంజితాగితే కొంత దిటవుగా వుంటది" అనుకున్నాడు ఆకలితీరని సుందర్రావు.

ఇంతలోనే పక్కింటి మునెయ్య కూతురు చెంద్రిమ్మ చేత్తో ముంతపట్టుకుని అక్కడికొచ్చి నిల్చుంది. "ఏఁవేపిల్లా. ఇల్లా గొచ్చేవ్?" అని అడిగింది దుర్గమ్మ. ఆమెచేతిలో గెంజిదాకవుంది.

''ఇదిగోనే.... మాయమ్మ.... కొంత గెంజుందేమో.... అడిగిరమ్మంది'' అని భయపడుతూ చెప్పిందాపిల్ల.

దుర్గమ్మ దాకలోని గెంజివైపూ, భర్త ముందున్న గిన్నెవైపూ మార్చి మార్చి చూసింది. ''ఈగెంజి ఒకలోటా గలాసుడుకూడా లేదు దీన్ని ఈపిల్లకిచ్చేస్తే యింకేం వుంటది?'' అనుకుంది మనసులో.

''అగెంజి సెంద్రమ్మకిచ్చెయ్యి'' అన్నాడు సుందర్రావు, జీవకళలేని ఆ ఎనిమిదేళ్ల పిల్ల మొహాన్ని చూడగానే అతనా నిర్ణయం చేసుకున్నాడు.

''మరి నీకొద్దేంట్రా బాబా? నువ్వదిన్న పొద్దుం రొండుముద్దలైనా లేదు'' అని అడిగింది తల్లి ఆదుర్దాగా.

''ఒద్దే ఈపూట నాకాకల్లేదు'' అన్నాడు సుందర్రావు. దుర్గమ్మ దాకలోవున్న గెంజిని చెంద్రిమ్మ చేతిలోవున్న ముంతలో పోసింది. చెంద్రమ్మ వెళ్ళిపోయింది.

''ఈమాత్రం గెంజికీ నీళ్లుగలిపి ఐదుగురు తాగుతారు. అంటే ఆళ్లకీపూట అన్నంవే లేదన్నమాట'' అనుకున్నాడు సుందర్రావు లేస్తూ.

చెయ్యి కడుక్కున్నాడు. ''ఒకేళ ఆ పిల్లొచ్చేటప్పుడికి గెంజిలేకపోతే ఆళ్ళంతా యీపూట కడుపులో కాళ్ళెట్టుకుని పడుకునేవోళ్లన్నమాట'' అనికూడా అనుకున్నాడు ఈ ఆలోచనతో అతని మనసు మరింత చికాకుతో నిండిపోయింది.

''ఇయ్యేల్ల కెల్లాగో సదురుకున్నాం. తెల్లారితే ఏం దినాలో తెలవటం లేదు. కొంపలో ఒక్క బియ్యపగింజలేదు. కోవటి సేసయ్య అరువిత్తాడో ఇయ్యడో. ఇవ్వకపోతే ఏందింటాం?''

తల్లికి కలిగిన సందేహాలే అతనికీ కలిగాయి. ఒళ్ళెరగకుండా నిద్రిపోతున్న పిల్లలవైపు చూశాడు. ఏం చెయ్యాలో అతనికి తోచలేదు. మాలపల్లిలో అందరిపరిస్థితీ దాదాపు ఒకేలాగవుందని అతనికితెలుసు. ఎవరికివారే తమ ఆకలితీర్చుకోవడానికి తంటాలు పడుతున్నారు.

గుడిసె దాటివచ్చాడు. నల్లని ఆకాశంలో మెరుస్తోన్న నక్షత్రాలు పిల్లకాలవలో ప్రతిఫలిస్తున్నాయి. కాలవకవతల పొలాలో నక్కలు అరుస్తున్నాయి. దూరాన ట్రంకు రోడ్డుమీద ఏదోలారీ పోతున్నశబ్దం లీలగా వినబడుతోంది.

సహదేవుడి గుడిసె దగ్గిరకొచ్చి, ''సాదేవా, ఒరే సాదేవా'' అని పిలిచేడు సుందర్రావు.

"లేదు మాఁవయ్యా. రాఁవాలయం కాడికెల్లేడు" అవి చెప్పింది సహదేవుడి భార్య ముత్యాలు.

రామాలయం ఒకటి అసలు గాొమంలోవుంది. అదికాకుండా మాలపల్లిలో మరొక "రామాలయా"న్ని గ్రామ పెద్దల అండదండలతో "హరిజనులు" కట్టుకో వలసివచ్చింది. గ్రామంలోని రామాలయంలోకి ఈ మాలపల్లివాళ్ళెవ్వరూ వెళ్లరు.

రామాలయం వైపు నడిచేడు సుందర్రావు.

* *

"ఈ లెక్కనయితే ఈయేడు గొంతేలమ్మ పండగేం జేసుకుంటాం?" అంటు న్నాడు సుబ్బన్నతాత సుందర్రావు అక్కడికి చేరేసరికి.

సుబ్బన్నతాత రామాలయం ఎదురుగావున్న రావిచెట్టుకింద కొలువుదీర్చేడు. అతని చుట్టూ పది - పదిహేనుమంది కూర్చునివున్నారు. వాళ్లలో సహదేవుడు కూడా వున్నాడు. రాత్రి పొద్దుపోయేదాకా అక్కడ కాలక్షేపం చెయ్యడం వాళ్లకలవాటు.

"ఈడెక్కడ దొరికేడ్రా మనకి? కొంప అంటుకుంటంటే బీడీ వెలిగించుకునే వోడిలాగ ఓపక్కని తింటాకి తిండిలేక యేడుత్తావుంటే గొంతేలం పొండుగంటా లంకించుకున్నాడేంటి" అన్నాడు పిల్లొకడు.

"ఓరి నన్నాసెదవా. ఏటికోతూరైనా పండుగు సప్పల్దినొద్దేంటి? నాకు 'ఉత' దెలిసినప్పట్ణించి యిప్పుడుదాకా ఏయేడైనా పండుగు మానేసేఁవా? ఈయేడు మన కరమం యిలాగేడిసిందిగాని" అన్నాడు సుబ్బన్నతాత.

"ముసల్లమ్డీకొడకా, నీకిప్పుడు పప్పులే తక్కువైనియ్" అన్నాడు పెంటయ్య వేళాకోళంగా.

దాంతో సుబ్బన్నతాతకి కాస్తకోపం వచ్చింది. "ఓఁకుర్ర తత్తుకొడకా. పెద్దంతరం సిన్నంతరం లేకుండా పేలతన్నావు యెదవ సేలావన" అంటూ లేచి పెంటయ్యమీది కెళ్లబోయాడు. "అగరా పెద్దోడా ఏదో కుర్రయెదవ తెలవకన్నాడు. ఊరుకో" అంటూ కిష్టిగాడు అడ్డుతగిలాడు. సుబ్బన్నతాత గొణుక్కుంటూ కూర్చు న్నాడు.

కిష్టిగాడు "దత్తుడురాజు" దగ్గిర పెద్దపాలేరు. దత్తుడురాజు అవూళ్ళోకల్లా పెద్ద భూస్వామి. కిష్టిగాడు పేదకుటుంబం నుంచి వచ్చినప్పటికీ "రాజుగారి కమతగాడు" అనిపించుకుంటూ కాస్తహోదా వెలగబెడుతున్నాడు. రోజుకూలీల కెళ్లేవాళ్ళూ, చిన్న రైతులదగ్గిర పాలేరుతనం చేసేవాళ్ళూ వాడికి సాటివాళ్ళలాగ కనిపించరు.

"కూకోరా సుందర్రావా వొణ్ణం దిన్నావా?" అంటూ పలకరించేడు సహదేవుడు సుందర్రావుని.

"వొణ్ణ (వం టే గేపకవొచ్చింది. ఒరే సాదేవా. సేసయ్య సావకారు అరువులిత్తంలేదంట ...?" అన్నాడు ఏసుపాదం.

"ఇవ్వడంట. పొద్దున్న నేనెల్లొచ్చేను.... లచ్చ రూపాలు వూరిమీద వొడ్డీకి దిప్పుతాడుగాని మన కరువిత్తాని కేడుత్తాడు" అన్నాడు నారాయుడు.

"ఊరొదిలి పారిపోతా(వనుకున్నాడేంటి?" అన్నాడు గంగడు.

"పాపం ఆ కోపటాయన మాత్తరం ఏం జేస్తాడు? అడ్డవైనోళ్ళందరికీ అరువులిచ్చేత్తే నాలుగోనాడు నెత్తిని పెంగేసుకుపోవాలి" అన్నాడు కిష్టిగాడు.

"పాపం. కిట్టయ్యమావకి సావకారంటే ఎంతజాలి" అన్నాడు నర్సిమ్మూర్తి.

"జమీందారుల్దగ్గిర కమతగాడు కదా. సావకార్లంటే ఆమాత్తరం యిదుంటాది మరి" అన్నాడు సామియేలు.

కిష్టిగాడికి కోపం వచ్చింది. "ఓరెదవన్నర యెదవల్లారా. ఎప్పుడు జూసినా నాకుబడియేడుత్తారుగాని మీ బతుకు లిలాగున్నందు కేడవ(రేవిరా?" అన్నాడు వుక్రోషంగా.

గంగడు వుండబట్టలేకపోయాడు. "మా బతుకులకే(విరా? మేవు ఎవడిదగ్గిరా యెంగిలి నీళ్లతాగి బతకడంలేదు. మా రెక్కల కస్టం...."

మాట పూర్తయేలోగానే కిష్టిగాడు గంగణ్ణి నమీపించి, "ఏం(ట్రా లంజాకొడకా. ఏవన్నావ్? మళ్లీఅను. మీన(వున్న మొగోడివైతే మళ్ళఅను–" అని సవాల్ చేశాడు.

"ఒక్కసారేంటెహె? లచ్చసార్లంటాను" అని గంగడు చెబుతోండగానే సుందర్రావూ, సహదేవుడూ, ఏసుపాదం కలగజేసుకున్నారు. కిష్టిగాడికి నచ్చజెప్పి యింటికి పంపేశారు.

కిష్టిగాడు వెళ్ళిపోయింతర్వాత అంతా వాణ్ణి తలోమాటా అన్నారు.

"నాలుగేళ్ళా నోట్లోకెల్తన్నాయి మరి. అమాత్రం గీరుండదా ఆడికి?" అన్నాడు సుందర్రావు.

'ఒల్లొంచి పన్జేసి యెరగడు. పెద్ద పాలేర్నిగదా అని ఆళ్ళమీదా ఈళ్ళమీదా అవులుజేత్తావుంటాడు యెదవ" అన్నాడు పెంటయ్య.

120

"జనార్దనారివుగారి గేది దత్తుడిసేను కడ్డఁవడితే అళ్లపాలేర్ని బట్టుకుని దత్తుడు సావగొట్టేడు గేపకఁవుందా? అప్పుడీడు దత్తుడు చేసిందాంటో తప్పేవీలేదన్జెప్పి నాతో దెబ్బలాదేడు" అన్నాడు ధర్మయ్య.

"దత్తుడాడికి దేవుడు"వు అన్నాడు సుబ్బన్నతాత.

"ఒరే ముసలోడా, నాకు తెలవకడుగుతానూ మనఁవేలేకపోతే ఈదత్తుదెవఁడ్రా?" అన్నాడు గంగడు.

"కుర్రోడివైనా మాబాగా జెప్పేవ్. నిజవేమరి. మనంలేపోతే ఈదత్తుదెవడు?" అన్నాడు సుబ్బన్నతాత గంగడిని సమర్థిస్తూ.

"ఒరే పెద్దోడా, మనకళ్ళముందు శానా యిద్దూరాలు జరిగిపోతున్నాయి. అటిని మనం సూళ్ళేకపోతన్నాం. ఇన్నేళ్లనించి యెగసాయప్పనులో కెల్తన్నాం. మనూరి రాజులూ, కమ్మోరు మనకేవిచ్చేరు? నెత్తికి సేతులిచ్చేరు. ఆళ్ళేమో యింకా యింకా గడించుకుంటన్నారు. దత్తుడు రాజు కెక్కడెక్కడ బూవులున్నాయో అయినికే గేపకఁ వుండదు పాపం. సూరపరాజుగారికి పంచదార మిల్లులో వాటావుంది. సత్తిన్నారాయణ గారు మెడాసెల్లి లచ్చలు పెట్టుబడెట్టి సినేఁవాదీత్తన్నాడు. అసలీళ్లకీ డబ్బెక్కడదంట? మనరెక్కల కస్టంకాదా?" అన్నాడు సుందర్రావు

"అంతేమరి" సాలోచనగా అన్నాడు సుబ్బన్నతాత.

"మనరెక్కల కస్టంగపోతే ఈ సూరపరాజుగాని దత్తుడురాజుగాని సత్తిన్నారాయణగాని ఎప్పుడన్నా దుక్కిదున్నేరా? ఊడుపూడ్సేరా?" అన్నాడు నారాయుడు

"మన పెసిరెంటు యిసినాదం మాత్తరం తక్కువ సంపాయించేడా? కాకినాడ్లో మేడగట్టేడు. రాజమంద్రంలో పెద్ద దుకాణపెట్టించేడు తమ్ముడిసేత" అన్నాడు సహదేవుడు.

"ఒరేయ్, అళ్ళని లచ్చాదికారుల్నిజేసి మనం వాణ్ణం మెతుకులికి మొకఁవాసి పోతన్నాం. ఆళ్ళేమో మనగాలితగిల్తేనే పాపాలంటుకున్నట్టు నానాగొడవా జేత్తారు. కానీ మనవసరం లేకండా ఒక్కరోజు గడవదీమోతుబరుకి" అన్నాడు సుందర్రావు.

"అంతేమరి, తొలకరినించి మాసూళ్లదాకా చేసీది మనఁవూ, అనబగించేది ఆళ్ళాను. ఏంజేత్తాం? బొమ్మదేవుడు రాసినరాత తప్పదు. మనకరమంరా బాబా" అన్నాడు సుబ్బన్నతాత.

"కరమంలేదు గిరమంలేదు. నువ్వు నోరుముయ్యిరా ముసలోడా" అన్నాడు పెంటయ్య.

"అది సరేగానీ. ఒరేయ్, నాకిదిజెప్పండాి. మన్లో ఎవడికైనా రెండు సొక్కాయి లున్నాయా?" అని అడిగాడు సుందర్రావు.

"రెండు సొక్కాల మాటకేంగాని ఒక్క సొక్కాగూడాలేని నాబోటోళ్ళు శానా మందున్నారు" అన్నాడు ఏసుపాదం.

"సొక్కాలదాకా ఎంతుకురా? సలికాలం వొచ్చింది. పిల్లలు కప్పుకుంటాకి సరైన దుప్పటిగుడ్డ ఎంతమందికుందిరా? ... ఎప్పుడు జూసినా బేడ మంచినూనీ. బేడ వుల్లిపాయిలూ, బేడ కిర్సనాలూ తప్పితే జల్మలో ఎప్పుడైనా ఒకసేరు మంచినూని, యీసెడు వుల్లిపాయిలు, సేరుకిర్సనాలుకొన్న మొకాలేనా మనయ్యి? సెప్పండ్రా?" సుందరావు కాస్తవుద్రేకంగా అన్నాడు.

అందరూ మౌనంగా వుండిపోయారు.

"ఒరేబాబా, మనం మాలోళ్ళం. రాజుల్లాగా, కమ్మోర్లాగా మనాదోళ్ల యిళ్లల్లో గూకుంటే మనకి జరగదురా. అందుకనే పనిదొరికిందంటే మనం మొగుడూ పెళ్లాం పనుల్లోకెల్లాలి ... ఏరాపెద్దోడా! ఇంతజేస్తచ్చినా మనల్ని నమ్ముకున్న పిల్లలకి కడుపు నిండా గెంజిపొయ్యలేకపోతన్నాం. ఇది ఎందువుసేతంటావు?"

"పెద్దోడు" ఏమీ చెప్పలేకపోయాడు.

"అదివోపోనీగానీ నాకీసంగతి చెప్పండొరె. మన్లో ఎవడింటోనైనా యిప్పుడు అడ్డిదంటే అడ్డెడు బియ్యపగింజలు దొరుకుతియ్యా? ... సెప్పండాి" అన్నాడు.

"బియ్యావిక్కరువొచ్చేసిందిరానారాయనా. ఈయేడు పంట బాగా తగ్గిపోయిందంట. బియ్యంధర పెరిగిపోయిందంట. కరణంవంటన్నాడు మొన్న" అన్నాడు సుబ్బన్నతాత.

"పంటతగ్గిపోటట్టేనేంటి లారీంమీద లారీలెల్తన్నాయిబియ్యం? నీకు తెలవకపోతే టంకురోడ్డుమీదకెల్లి జూడవయ్య" అన్నాడు ధర్మయ్య.

"మన్లో ఎవడికొంపలోనూ అడ్డెడుబియ్యంలేవుగాని బియ్యంలారీలు మాత్తరం మాజోరుగాయెల్తన్నాయి" అన్నాడు గంగడు.

"అడ్డంగొడదాంరండెహెలారీల్ని. ఎవడడ్డంవొత్తాడోసూద్దారి" అన్నాడు నర్సిమ్మూర్తి వుషారంగే ఆవేశంతో.

అంతకుముందు రామాలయంవైపు నడిచివస్తోండగా సుందర్రావుకికూడా యిదే ఆలోచనతట్టింది. తనకుకలిగిన ఆలోచనే నర్సిమ్మూర్తికికూడా కలిగినందుకతను ఆశ్చర్యపడ్డాడు.

"సెయ్యాలంటే సెయ్యొచ్చుగానీ తరవాత సిక్కుల్లోపడాతాఁవేమోనని కొంత యిదిగావుందిరా" అన్నాడు నారాయుడు.

"ఏసిక్కులూరాకండా అందరం ఆలోసించేసేద్దారి" అన్నాడు సామియేలు.

"అవునుమరి. కంగారుపడితే లాబంలేదు" అన్నాడు సహదేవుడు.

"ఏంట్రా? నిజంగా లారీలడ్డంగొడఁదావనే?"

అని అడిగాడు సుబ్బన్నతాత ఆదుర్దాగా.

"లేపోతే యాలాకోలఁవాడతన్నాఁవనుకున్నావా?" అన్నాడు పిల్లెంకడు.

'దొంగతనఁవెంతుకురాబాబా? తప్పుగాదంట్రా?'

'ఏడిసినట్టుంది. రామాయణఁవంతాయిని రావుడికిసీతేఁవవుద్దని అడిగినట్టు యించేపూ మనంమాట్టాడుకున్నదేంటి? నువ్వు అరదంజేసుకున్నదేంటి?' అన్నాడు గంగడు.

'అరవయ్యేళ్ళొచ్చినా నీకు బుర్రలేదురా ముసలోడా. మనం పెద్దపెద్దగరాణా దొంగల్దగ్గిర్నించి మన కూలోళ్ళక్కావలిసిన బియ్యందెచ్చుకుంటాఁవంతే. ఇది దొంగతనఁవెలాగవుద్ది?' అన్నాడు ఏసుపాదం.

"ఏమో మీయిస్టం. కాని జాగత్తాగా వుండాల్రా బాబా"

"నిజఁవే. జాగత్తాగా వుండాలి. మనం పరాయోళ్ళెవరికీ ఈయెవారం తెలవనివ్వకూడదు. కిట్టిగాడిలాంటోళ్ళకసలే తెలవకూడదు అన్ని యివరాలూ బాగా మాటాడుకుని. యీలు కుదిరితే రేపుమాపటికే జేసేద్దారి" అన్నాడు సుందర్రావు.

ఆ తర్వాత వాళ్లంతా తమ పథకాన్ని గురించి చర్చించుకున్నారు.

* * *

ఆ మర్నాడు రాత్రి పదిగంటల వేళ.

మాలపల్లికి దూరంగావున్న వూరు మాటుమణిగింది. పిల్లకాలవ అవతలిగట్టున నేరేడు చెట్టుకింద, దట్టమైన చీకట్లో సుందర్రావుతోపాటు దాదాపు ఏభైమంది కూర్చుని వున్నారు. అంతకు ముందురోజు రాత్రి రామాలయం దగ్గిర కలుసుకున్న వాళ్ల అతి రహస్యంగా మాలపల్లిలోని ముఖ్యమైన వాళ్ళందర్నీ కలుసుకుని, ఈనాటి సాహసానికి ఒప్పించారు.

ఇంతలోనే సుబ్బన్నతాతా, మునెయ్యా, అతని భార్య నాగమ్మా, సామియేలూ, అతని భార్య వజ్రావతీ, కూతురు సంతోషం వచ్చి వాళ్ళని కలుసుకున్నారు.

"అదోళ్ళెంతు కొచ్చేరు? బత్తాలు మొయ్యగల్దురేంటి? ఈ ముసలోడెంతుకు?" అన్నాడు సహదేవుడు.

"వొద్దంటే యినకుండా యెమ్మటబడ్డారు" అన్నాడు మునెయ్య.

"యేం? మాఁవురాకూడదా?" అనడిగింది నాగమ్మ.

"వొద్దు. ఎలిపోండి. పని శానాకష్టం. ఇల్లదగ్గిరుండండి. వనైతే రెండుగంటల్లో వొచ్చేత్తాం" అన్నాడు సుంద్రావు.

"జాగర్తాగా యెల్లిరండ్రా బాబా" అని వాళ్ళతో చెప్పాడు సుబ్బన్నతాత.

"ఎల్లండొాలే" అన్నాడు సామియేలు. సుబ్బన్నతాతా, ఆడవాళ్లూ 'పట్టె'మీదుగా కాలవదాటి మాఁపల్లివైపు వెళ్ళిపోయారు.

"అనుకున్నోళ్లంతా వొచ్చేశారు గందా?.... జాగర్తాగా వుండాలి. ఏది ఏమైనా సరే మనగుట్టు మాత్రం బయటపెట్టగూడదు. మీ బిడ్డలమీదొట్టు" అన్నాడు సుంద్రావు.

"అలాగే" అని భరోసా యిచ్చేరు వాళ్లు.

"ఇంకా యెంతుకిక్కడ? బయదెల్దాం నడవండ్రా" అంటూ కదిలాడు మునలయ్య.

"ఒరేయ్. ఒరేయ్. అందరూగలిసి వాడపిల్లి తీర్తానికెల్లినట్టు 'పొలో' మని పోవటంకాదు పదేసి పదేసిమందిని నేనూ, సాదేవా, గంగడూ, పిల్లెంకడూ, దరమయ్యా తీసికెల్తాం. ఇదుగో! మనఁ వెల్లవాలిసిన చోటుకెల్లేదాకా ఒక్కడుగూడా కిక్కురు మనకూడదు. తెలిసిందా?" అన్నాడు సుంద్రావు.

పిల్లెంకడు పదిమందిని తీసుకుని కాలవగట్టువిడిచి మునసబు పొలాని కడ్డంపడి ట్రంకురోడ్డువైపు నడకసాగించేడు అక్కడికి ట్రంకురోడ్డు రెండు ఫర్లాంగుల దూరం వుంటుంది.

మొదటి జట్టునలా బయల్దేరనిచ్చి, సహదేవుడు మరో పదిమందితో కాలవగట్టు మీద ఒకఫర్లాంగు దూరం వెళ్ళి, సీతయ్యగారి మామిడితోటలోకి మళ్ళి ట్రంకురోడ్డు వైపు నడకసాగించేడు.

మిగతా మూడుజట్లూ వేరువేరు దారుల్లో బయల్దేరారు. మొత్తంమీద అందరూ ట్రంకు రోడ్డుమీదున్న వంతెనదగ్గిర కలుసుకున్నారు. ట్రంకురోడ్డుకి అవతలివైపు, ఆ వంతెనకి ఒక ఫర్లాంగు దూరంలో ఆవూరి మాదిగపల్లి వుంది.

సుంద్రావూ, సహదేవుడూ, గంగడూ, ధర్మయ్యా, పిల్లెంకడూ వంతెన పక్కగా నిలబడ్డారు. మిగతా జనమంతా మరికాస్త వెనక్కివెళ్ళి జనపచేను గటమీద కూర్చున్నారు. ఆ చీకట్లో వాళ్లనెవరూ గమనించలేరు.

అందరూ మంత్రించినట్టు నిశ్శబ్దంగా వున్నారు. ఆ నిశ్శబ్ద వాతావరణంలో ఏభై మంది చైతన్యవంతులైన పేదలు ఒకచిన్న అవకాశంకోసం ఎదురుచూస్తున్నారు.

అరగంట గడిచింది. దూరంగా హెడ్‌లైట్లు కనిపించాయి.

"సిన్నకారు" అన్నాడు ధర్మయ్య లైట్లకీ, భూమికీ మధ్యవున్న దూరాన్నిబట్టి.

"అవును" అన్నాడు సుందర్రావు. ఐదుగురూ వంతెన వెనక నక్కారు చిన్న కారు వెళ్ళిపోయింది.

మరో పావుగంటకి ఒక గవర్నమెంటు బస్సు వెళ్ళింది.

బస్సువెళ్లిన పదినిముషాల్లో దూరంగా లారీ హెడ్‌లైట్లు కనిపించాయి శబ్దాన్ని బట్టి అది లారీయేనని వాళ్ళు సులువుగా పోల్చారు. వెంటనే భుజంమీది కండువాలుతీసి, ముఖం సరిగా కనిపించకుండా చెవులమీదుగా తలపాగాలు చుట్టుకున్నారు. ఐదుగురూ రోడ్డుకడ్డంగా నిలబడ్డారు.

చేనిగట్లమీదవున్న జనం జరగబోయేదానికోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

లారీ దగ్గరయింది. సుందర్రావు చెయ్యి అడ్డంపెట్టాడు. లారీ వాళ్లని సమీపించి ఆగింది. "ఏంటి?" అని అడిగేడు డ్రైవరు విసుగ్గా.

"బాబ్బాబు, మా యిద్దర్నీ తీసికెళ్లి రావులపాలెంలో దింపెయ్యి బాబు. అక్కడ మాయప్పకి పేణంమీద కొచ్చింది. డబ్బులిస్తాం బాబు" అని ప్రాధేయ పడుతున్నాడు సహదేవుడు. ఈలోపుగానే గంగడు లారీని చుట్టివచ్చి అది బియ్యం లారీయేనని నిర్ధారణ చేసుకుని సన్నగా యీలవేశాడు. చేనిగట్లమీదున్న జనం మాటా పలుకూ లేకుండా బయల్దేరి రోడ్డెక్కారు.

"సోట్లేదు" అని నిర్లక్ష్యంగా చెప్పబోతున్న డ్రైవరు సుందర్రావు చేతిలోకత్తి చూసి బెదిరిపోయాడు ఇంతలోనే ఆతను ఎదురుగా జనాన్నిచూశాడు భయంతో వణికి పోయాడు.

"నిన్నేమీ జెయ్యం. బయపడకు" అన్నాడు సుందర్రావు

డ్రైవరు భయం కొంత తగ్గింది. "లారీని రోడ్డుపక్కగా నిలబెట్టు" అన్నాడు సుందర్రావు ఆజ్ఞాపూర్వకంగా.

ఆజ్ఞ పాలించేడు డ్రైవరు.

"ఇంజినాపై. లయిట్లారిపై".

అలాగే చేశాడు డ్రైవరు.

"దిగిరా"

డ్రైవరుదిగాడు. 'క్లీనర్, నువ్వుగూడాదిగు'

'ఏంటీదవుర్జన్యం?' అన్నాడు క్లీనరు.

'మాటాడొద్దు. నోరిప్పితే దెబ్బదింటావు'

నర్సిమ్మూర్తి. గంగడూ. పెంటయ్యా. ఏసుపాదం డ్రైవర్నీ. క్లీనర్నీ జనప చేనుమధ్యకంటా నడిపించుకువెళ్ళి. అక్కడకూర్చోబెట్టారు.

'ఒక పదినిమసాలుగూకోండి. తరవాతెలిపోవచ్చు' అని వాళ్ళతో అన్నాడు పెంటయ్య స్నేహపూర్వకంగా.

నారాయుడూ. సుందర్రావూ. సామియేలూ. మునెయ్యాలారీపైకెక్కి కిందున్న వాళ్ళకి బస్తాలెత్తడం మొదలెట్టారు. వీపున బస్తామోస్తూఒక్కొక్కడూ చేలకడ్డంపడి మాలపల్లివైపు నడకసాగించారు.

లారీ సగంఖాళీఅయేటప్పటికి యెదురుగా ఒక చిన్నకారువస్తోన్న సూచనలు కని పించాయి. వెంటనే జనం చేలోకితప్పుకున్నారు. ఒక్క సుందర్రావుమాత్రం లారీ డోరు తెరిచివుంచి నిద్రపోతున్నట్టు నటించేడు. కారు వెళ్ళిపోయింది. వెంటనే జనం రంగంలోకి సిద్ధమయారు ఇళ్ళకి చేరవేసినవాళ్ళలో పదిమంది అలసటనుకూడా లెక్క చెయ్యకుండా తిరిగివచ్చారు వాళ్ళంతా మూగగా గొప్ప ఆనందం పొందుతున్నారు.

అర్ధరాత్రిదాటేసరికి వాళ్ళకార్యక్రమం దాదాపు ముగిసింది డ్రైవరుకీ, క్లీనరుకీ కాపలాగావున్నవాళ్ల తిరిగివచ్చారు.. వాళ్లూ. సుందర్రావూ తలకొకబస్తానూ ఎత్తుకుని బయల్దేరారు. తీసుకెళ్ళేవీలులేక వాళ్ల పదిబస్తాల్ని లారీలోనే వదిలివేశారు.

డ్రైవరూ, క్లీనరూ మతిలేనివాళ్ళలాగ లారీదగ్గిరకి నడుచుకుంటూ వచ్చారు.

* * *

ఆరాత్రి వాళ్ళెవరూ నిద్రపోలేదు. తెచ్చుకున్న బియ్యాన్ని దాచుకోవడంతోనే ఆరాత్రంతా గడిచిపోయింది.

ఆడవాళ్లుకూడా మగవాళ్ళతోపాటు శ్రమపడ్డారు. గునపాలకీ, పార్లకీ పని తగి లింది. ఇంతజరుగుతున్నప్పటికీ కిష్టిగాడిలాంటి దళారీలకి ఏమాత్రం తెలియకుండా జాగ్రత్తపడ్డారు.

గంగడు తన వాటాకొచ్చిన బస్తాబియ్యం తనకున్న కాస్త పెరట్లోనూ గొయ్యితీసి అందులో పాతిపెట్టాడు. గోతిపైన తుక్కూ దూగరాపోసి అసలక్కడ తవ్వినగుర్తులే లేకుండాచేశాడు. ఈపద్ధతి చాలామంది అవలంబించేరు.

ఏసుపాదం భార్య రూతమ్మ బియ్యం బస్తాను వంచపాళీలో పెట్టి, చుట్టూపిడకల గూడుకట్టింది.

అటకలున్న వాళ్ళు అటకపైనవేసి, బస్తా కనబడకుండా తాళ్ళూ పేళ్ళూ అడ్డదిడ్డంగా పారేశారు.

సామియేలూ, నారాయుడూ, మరికొందరు తమబస్తాలు తీసుకెళ్ళి మాలపల్లి పక్కనేవున్న పోరంబోకు భూమిలో పాతిపెట్టారు.

ఎవరికివాళ్లు తీసుకోగా చివరికి పదకొండు బస్తాలు మిగిలిపోయాయి. ముఖ్యమైనవాళ్లు పదిమందీ ఆలోచించారు.

"పాపం సూసివోళ్లూ సేసివోళ్ళూ లేక సుబ్బన్నాత గిజగిజలాడిపోతన్నాడు. ఆడికి మనం వాటాయివ్వాలి" అన్నాడు నర్సిమ్మూర్తి.

"మరి మన మేస్టరమ్మ క్రుపావతమ్మకి, పాపం, మూడు మాసాల్నించి జీతాల్లేవు. ఆతల్లి సంగతిగూడా మనంవాలోసించాలి" అన్నాడు పిల్లెంకడు.

వాళ్ళిద్దరికీ చెరోబస్తా కేటాయించాలని నిర్ణయించారు.

"ఈ మిగిలిపోయిన బత్తాలు దరమయ్య సేలోదాయాలి" అన్నాడు సుందర్రావు. ధర్మయ్యకి పూర్వీకులిచ్చిన అరెకరం భూమివుంది. అతనొక పేదరైతు.

"ఎంతుకని?" అని అడిగాడు గంగడు.

"ఎంతుకంటే.... ఒకేళ రేపు పోలీసోళ్లొచ్చి మన గుట్టుకనిపెట్టి బియ్యంవన్నీ పట్టికెళ్ళిపోతారనుకో. అప్పుడింక మనోళ్ళం దింటార్రా? అంతుకే ఈ బత్తాలు మన వుమ్మడి సొత్తనుకుని దాసుకోవాలి. రేపు ఎటుదిరిగి ఎటొచ్చినా ఈ బత్తాలైనా మిగుల్తాయి. ఏవంటా?" అన్నాడు సుందర్రావు.

అతను చెప్పిందాని కందరూ అంగీకరించారు. గునపాలూ, పారలూ తీసుకుని ఆ బస్తాలతో పొలం బయల్దేరారు. వాళ్ళు పొలం నుంచి తిరిగివచ్చేటప్పటికి తొలకోడి కూసింది.

* * *

తెల్లవారుతోండగా పోలీసు జీపు వంతెనదగ్గిర ఆగింది. సబిన్స్పెక్టరూ, హెడ్డూ, ఇద్దరు పోలీసులూ, లారీ డ్రైవరూ, క్లీనరూ దిగేరు.

"ఇక్కడేనండి" అంటూ ఘటన జరిగిన స్థలాన్ని చూపించాడు డ్రైవరు. 127

నేలమీదరాలిన బియ్యం గింజలు జరిగినదానికి సాక్ష్యంగావున్నాయి. ఏదోవస్తువు

పారేసుకున్న వాళ్ళలాగ యిద్దరు పోలీసులు ఆ చోటంతా వెదకడం మొదలుపెట్టారు.

"బస్తాలు తీసుకుని వాళ్ళెటెల్లారు ?" అని అడిగేడు ఇనస్పెక్టరు.

"మమ్మల్నిద్దర్నీ ఆ జనపసేలో గూకోబెట్టి నలుగురు కాపలావున్నారు గదాండి. అంతుకని సీకట్లో ఆళ్ళెటెళ్ళేరో కనబళ్లేదండి" అన్నాడు డ్రైవరు.

"లారీ ఆపినవాళ్లుగాని మీకు కాపలావున్నవాళ్లుగాని కనిపిస్తే గుర్తుపట్టగలరా?"

"కస్టంవండి" అని యిద్దరూ ఒప్పేసుకున్నారు.

"ఏడిసినట్టుంది. పోనీ వాళ్లలో ఎవడిపేరైనా మీకు తెలుసా ?"

"మాదగ్గిర కాపలావున్నా వోళ్ళల్లో ఒకడిపేరుమాత్రం గంగడని ఆళ్లమాటల్లో తెలిసిందండి".

"ఫరవాలేదు, ఆమాత్రమైనా జ్ఞాపకం వుండేడిసింది" అంటూ పరిశీలనగా చుట్టూ చూశాడు ఇనస్పెక్టరు, కనుచూపు మేరలో మాదిగపల్లి కనిపించింది.

జీపు మాదిగపల్లి శివార్లో ఆగింది. జీపును చూడగానే ఖంగారుపడుతూ నరిసిగాడు జీపుదగ్గిరకొచ్చి, అల్లంతదూరంలో చేతులుకట్టుకు నిలబడ్డాడు.

"నీపేరేంట్రా?" ఇనస్పెక్టరు ప్రశ్న.

"నరిసిగోణ్నండి బాబయ్యా, ఈవూరికి తలారోణ్నండె".

"గంగడు యింటో వున్నాడా ?"

"సిత్తం.... ఏ గంగడండి బాబయ్యా ?"

"ఎంతమందున్నా రేవిటి ఆ పేరుతో ?"

"ఇద్దరున్నారండె ఒకడేమో పుల్లిగాడి కొడుకండె. ఆడు సిన్నోడు. ఇంకొకడేమో కొంత పెద్దోడుండె".

"ఇద్దర్నీ తీసుకురా"

"సిత్తం సిత్తం". తలారి వెళ్ళాడు.

ఇంతలోనే లారీకీ, అందులోని సరుక్కీ యజమాని ఐన సుబ్బరాజుగారి కొడుకు క్రిష్ణంరాజు మోటార్ సైకిల్ మీద అక్కడికొచ్చేడు. 'ఏంతిడతాడో' అని డ్రైవరూ, క్లీనరూ భయం భయంగా నిలబడ్డారు. కాని అతను వాళ్ళవంక చూడనేలేదు.

"నాన్నగారు లేరాండి ?" అని సాదరంగా అడిగేడు ఇనస్పెక్టరు.

"లేరండీ, లాస్టనైట్ హైద్రాబాదెళ్ళేరు" అన్నాడు క్రిష్ణంరాజు, "మీ కబురు నాకిప్పుడే అందింది. ఇన్వెస్టిగేషన్ ఎందాకా వచ్చింది ?".

"దొరికిపోతారెండి వెధవలు" అని నవ్వేడు ఇనస్పెక్టరు.

'గంగడు' పేరుతోవున్న యిద్దరూ వచ్చారు. ఒకడికి ఏభైఏళ్లుంటాయి. రెండో వాడికి పద్దెనిమిదేళ్లుంటాయి. ఇద్దరికీ ఒంటిమీద గోచీ, మాసిపోయిన చిరుగుల కండువా తప్ప మరేమీలేదు. భయం భయంగా దూరం దూరంగా నిలబడ్డారు చేతులు కట్టుకుని.

"వీళ్ళలో ఎవడు?" అని అడిగేడు ఇనస్పెక్టరు.

"సీకటికదాండి, ఆనమాలు దొరకటం లేదండి" అన్నారు డ్రైవరూ, క్లీనరూను. ఆ యిద్దరూ కాదేమోనని వాళ్లు మనసులో అనుకున్నారు. కాని పైకిచెప్పే ధైర్యం లేకపోయింది.

"ఏరా గంగా! ఏమాత్రం బియ్యం దొరికాయిరా?" అని అడిగేడు ఇనస్పెక్టరు ఇద్దర్నీ మార్చిమార్చిచూస్తూ. తనతెలివిమీద అతనికి గొప్ప నమ్మకం వుంది. అందరు పోలీసువాళ్లలాగే అతనికి కూడా అంతులేని దురహంకారం వుంది.

వాళ్ళిద్దరూ అయోమయంలో పడ్డారు. "త.... తమురు నన్నే అడుగుతున్నారాండి?" అంటూ తడబడ్డాడు ముసలి గంగడు.

"నిన్నేరా" అంటూ మళ్ళీ యిద్దరివంకా చూశాడు ఇనస్పెక్టరు.

"ఏ బియ్యమండె?" అని అడిగేడు పడుచు గంగడు అమాయకంగా.

"నాటకాలాడక నిజం జెప్పెయ్యండ్రా. లేపోతే తోళ్ళూడిపోతై" అని హెడ్డు హెచ్చరించేడు.

"మ.... మాకేంవీ తెలవదండె. నా బిడ్డలమీద పెమాణకంజేసి చెవుతున్నాను. సిన్నప్పుణ్నుంచీ ఈవూరు రైతులికి సెప్పులు గుడతన్నాను గంగడెలాంటోడని ఏరైతునైనా అడగండయ్యగారూ" అన్నాడు ముసలి గంగడు వణికిపోతూ.

"ఊం. సరే.... ఒరేయ్. మీరిద్దరూ వీళ్ళ కొంపలూ, వీళ్ళచుట్టాల కొంపలూ తనిఖీ చెయ్యండి" అంటూ పోలీసు లిద్దరికీ ఆర్డరు జారీచేశాడు ఇనస్పెక్టరు. "ఒరే తలారీ. వీళ్ళిద్దర్నీ గ్రామ చావడికి తీసుకురా" అని. "పదండి సార్" అని కిష్టంరాజుతో చెప్పి జీపుస్టార్టు చేశాడు.

* * *

ఆ యిద్దరు పోలీసులూ మాదిగవాళ్ల గుడిసెల్లోని కుండా మండా పగలగొట్టి, ఏమీ ఆచూకీచిక్కక గ్రామ చావడికి తిరిగొచ్చారు. ఏ గుడిసెలోనూ తవ్వెడు బియ్యం కన్నా ఎక్కువ కనిపించలేదని చెప్పేరు. అయితేనేం? వాళ్లు తిరిగొచ్చేటప్పటికే హెడ్డు ఆ యిద్దరు మాదిగల ఒళ్లు హూనం చేశాడు. ఆ దెబ్బల ధాటినుంచి కోలుకోవ

దానికి వాళ్ళకి కనీసం వారం రోజులు పడుతుంది. బాధతో మూలుగుతూ, భయంతో వణికిపోతూ నిలబడ్డారు వాళ్లిద్దరూ. వాళ్లని మధ్యాన్నానికి విడిచిపెట్టారు.

ఇదంతా ప్రెసిడెంటు, కరణం, మునసబుల సమక్షంలో జరిగింది.

ఆపూట పోలీసు బృందానికి మునసబు భోజనాలు ఏర్పాటుచేశాడు.

విచారించగా మాలపల్లిలో మరొక గంగడున్నాడని తెలిసింది ఇనస్పెక్టరుకి, వెంటనే కబురు పంపించేడు.

"ఆడు పోకిరీయెదవేనండి. ఆడిమీద నాకెప్పుడూ అనుమానంవేనండి"అన్నాడు కిష్టిగాడు ఒక పోలీసువాడితో.

గంగణ్ణి తీసుకొచ్చేరు. వాడు ధైర్యంగానేవున్నాడు. "అరుసూరైనాసరే నూరు ఆరైనాసరే మనగుట్టుమాత్తరం పైవోడికెవడికీ తెలవగూడదు. ఒకవేళ మన్లో ఎవడైనా పోలీసోళ్ళకి దొరికిపోతే ఆబాదేదో ఆడొక్కడే పడాలిగాని మనగుట్టుమాత్తరం జెప్ప కూడదు." సుందర్రావుమాటలు గంగడికి పదేపదే జ్ఞాపకంవొస్తున్నాయి.

ఇనస్పెక్టరుకి నాలుగుబారలదూరంలో చేతులుకట్టుకు నిలబడ్డాడు గంగడు.

"నీ పేరేంటా్రి?" ఇనస్పెక్టరు అడిగేడు.

"మైనం గంగయ్యండి."

"ఏంచేస్తూంటావు?"

"ఆదినారాయణగారి పాలేర్నండి."

"చాలా ధైర్యవంతుడివని విన్నాను!"

ఏంమాటాడాలో తెలియలేదుగంగడికి.

"దారిదోపిడీకి శిక్షఏమిటో తెలుసా?"

"…… …… …… …… ……"

"ఉరిశిక్ష"అని తనే జవాబుచెప్పేడు ఇనస్పెక్టరు. "అంచేత నిన్నరాత్రినువ్వు ఏంచేసేవో ఎవరెవరితో వెళ్ళి ఆలారీ దోచుకున్నావో చెప్పేసెయ్యి. తప్పు ఒప్పు కుంటే యిప్పుడే విడిచిపెట్టేస్తాం"

"నాకేంవీ తెలవదు మారాజా" చాలా వినయంగాచెప్పేడు గంగడు.

"ఒరేయ్. బిగారు మంచోరుగనక ఆ మాత్రిం అడుగుతున్నారు. అబద్దంవాడితే జాగర్త. మామాయింవొండేస్తాం"అని గద్దించేడు హెడ్డు.

"చెప్పెయ్యరా. అనవసరంగా దెబ్బలుతినకు" అని సలహాయిచ్చేరు ప్రెసిడెంటు మునసబు, కరణాలు.

"నిజంగా నాకేఁవీ తెలవదండె" చాలా అమాయకంగా చెప్పేడు గంగడు

లాఠీలకు పనితగిలింది. బూటుకాళ్ళతో పొట్టలోతన్నేరు. చాలా ఓపిగ్గాహింసించారు. మధ్యమధ్యలో బూతులు; "ఇప్పటికైనా చెబుతావా?" అవి ఇ-స స్పెక్టరు ప్రశ్నలు.

"నేనేపాపం యెరుగను దేవుడో" అని బాధతో గంగడి అరుపులు హింసలవల్ల కలిగేబాధ వాస్తవం. ఆకలిబాధకూడా వాస్తవమే. ఐతే హింసలవల్లకలిగే బాధ శాశ్వతంకాదు. గంగడుమాత్రం వాళ్ళకి ఏవిధమైన ఆచూకీ యివ్వలేదు

సాయంత్రం నాలుగ్గంటలైంది. ఇద్దరు పోలీసువాళ్ళు కిష్టిగాడి సహకారంతో గంగడియింటినీ. సుంద్రావు, సహదేవుడు, పిల్లెంకడు వగైరా అందరియిళ్ళనూ సోదా చేశారు. ఎక్కడావాళ్ళకి ఆచూకీ దొరకలేదు.

సొమ్మసిలి పడిపోయిన గంగణ్ణి బంధువులకు అప్పగించేరు.

ఐదుగంటలకల్లా జిల్లా పోలీసు సూపర్నెంటువచ్చేడు. సర్కిలిన్స్పెక్టరుకూడా ఆయనతోవున్నాడు. సూపర్నెంటు కేసు వివరాలు తెలుసుకున్నాడు. ఆయనకి డ్రైవరుమీదా, క్లీనరుమీదా అనుమానం కలిగింది "వాళ్ళు నమ్మకస్తులే" నని కిష్టంరాజు చెప్పినమీదట, "సరే.... ఈ వూళ్ళో మనం చెయ్యడానికేఁవుంది. పదండి. చుట్టుపక్కల వూళ్ళలో ఇన్వెస్టిగేషన్ మొదలెట్టండి" అన్నాడు సూపర్నెంటు.

"మావూరొచ్చి మీరిలా తిరిగెల్లటానికీల్లేదు. మాడిన్నరు తీసుకువురీ వెళ్ళాలి" అని సూపర్నెంటును బలవంతం చేశాడు ప్రెసిడెంటు. ఒప్పుకోక తప్పలేదు సూపర్నెంటుకి.

ప్రెసిడెంటు కాకినాడలో 'బార్' ఒకటి ప్రారంభించే వుద్దేశంతో వున్నాడు. అలాంటి పెద్దమనిషికి సూపర్నెంటు దగ్గిర కాస్త పలుకుబడివుంటే ఎంతైనా మంచిది కదా?

అరడజను కోళ్లను కోయించి, సూపర్నెంటుకీ, ఇతర పోలీసు బలగానికీ ఘనంగా విందుచేశాడు ప్రెసిడెంటు. అందులో క్రిష్ణంరాజుకూడా పాల్గొనవలసి వచ్చింది.

విందు పూర్తయిన తర్వాత సూపర్నెంటు కార్లో వెళ్ళిపోయాడు, "రేపు సాయంత్రానికల్లా రిజల్ట్స్ రావాలం"టూ.

" తెల్లారితే ఏవూరిమీద పడదామా " అని ఆలోచిస్తూ • పోలీసు సిబ్బంది జీపెక్కింది.

*   *   *

మూడోనాటికి గంగడు కొంచెం కోలుకున్నాడు. ఆమూడు రోజులూ మాలపల్లి వాళ్లంతా అతన్ని పరామర్శించారు; అన్ని సపర్యలూ చేశారు. అబాలగోపాలం అతని పట్టుదలను మెచ్చుకున్నారు. పోలీసు మూకను తిట్టిపోశారు. పోలీసువాళ్ళ చేతిలో విచ్చలవిడిగా దెబ్బలుతిన్న మాదిగపల్లి వాసులిద్దరి విషయంలోనూ వారుజాలిపడ్డారు.

మొత్తంమీద వారి సాహసానికీ, చొరవకూ ఫలితం దొరికింది. వాళ్ళ శ్రమ వృధాపోలేదు. రహస్యపద్ధతిలో, ఐకమత్యంతో చేసిన ఏపనైనా విజయవంతంగా జరుగుతుందని ఆ నిరుపేదలు అనుభవంలో తెలుసుకున్నారు. చిత్రమేమిటంటే ఈ ఘటనతో ఏళ్లతరబడి శత్రువులుగా వుంటున్న కుటుంబాలు కూడా ఏకమయ్యాయి. ఈ ఘటన వారందరికీ గొప్ప వుత్సాహాన్ని కలిగించింది

ఇంత జరిగినా వాళ్ళ రహస్యం మాలపల్లి దాటిపోలేదు. వాళ్ళు మామూలుగానే పనులు చేసుకుంటున్నారు "బియ్యం అరువియ్యమ"ని కోమటి శేషయ్యని బతిమాలు తూనే వున్నారు; తవ్వెడో–శేరో తీసుకెళ్తూనే వున్నారు.

*   *   *

ఆరోజు తెల్లవారుతోందగానే నారాయుడు వుతికిన చొక్కావేసుకుని సుందర్రావు కెదురయ్యాడు కాలవగట్టుమీద.

"ఏవూరెల్తన్నా?" అని అడిగేడు సుందర్రావు.

"ఊబలంక. సందాల కొచ్చేత్తాను. అక్కడ మా బామ్మరిది కుటుంబం తిండికి లేక నానాబాదలూ పడతన్నారు. ఐదురూపాయి లంపమని రావులపాడు సిన్నయ్యసేత కవురంపించేడు. సరే, పట్టికెల్లిచ్చినట్టూ వుంటది; ఆళ్ళనూసొచ్చినట్టూ వుంటదని మా యాడది జెపితే యెల్తన్నాను" అని. "అన్నట్టు మనం నడిపినయెవ్వారం ఆడిక్కూడా సెబుతాను. ఈలుకుదిరితే ఆళ్ళుకూడా మనం జేసినట్టేసేత్తారు. మరెంతకాలం వని కడుపులు కాలబెట్టుకుంటారాళ్ళుమాత్తరం?" అన్నాడు నారాయుడు.

"సెప్పు. నమ్మకంవైనోళ్ళందరికీ సెప్పాలిమరి. ఒరేయ్, మనంవంతా కలిసి కట్టుగావుంటే ఈ పెపంచకం మొత్తంమీద మన్నెవడూ ఏంచీజెయ్యాలేడు" అన్నాడు సుందర్రావు, నారాయుడు వెళ్ళిపోయాడు.

132

చేసింది చాలదనీ, ఇంకా ఏమేమో చెయ్యాలనీ సుందర్రావుకి అనిపిస్తోంది. అతని బుర్రలో ఎన్నో ఆలోచనలు.... ఎన్నోవ్యూహాలు :

''పాలేరోడూ, కూలోడూ కడుపునిండా తిని, తలెత్తుకు తిరిగే రోజెప్పు డొత్తదో !''

''అయ్యో బాబూ అవి బలిమాలితే నాయం జరిగేరోజులు కాదియ్య''........

తూర్పుదిక్కున అరుణభాను డుదయించాడు.

జనం

శ్రీపతి

వలభై మైళ్ళ ప్రయాణమే అయినా రెండు గంటలు పట్టింది. దారంతా ఇళ్ళ కొస్తున్న పసుల మందలు. ఆ పసులకాపర్లు వాటిని రోడ్డుకు ఓపక్కనించి తోల్తారా అంటే రోడ్లకి ఒకపక్కే ఉంది రెండోపక్క అన్నదిలేదు. ఇంకొన్ని దగ్గర్లయితే ఎదురుగావస్తున్న రథాన్ని పూర్తిగారానిచ్చి రెండోరథం కదలాలి. ఇక అది ఏకారయితేనేం— రెండు గంటల్లో వచ్చినందుకు సంతోషం.

డ్రయివర్ ఆపేసి 'ఇక్కడ దిగిపోవాలి సార్' అన్నాడు.

చౌదురి దిగాడు. చుట్టూ కొబ్బరితోటలు. రకరకాల చిన్నాపెద్దా చెట్లు. అన్నీ ఒకేరంగుతో నల్లగా, అడవిలోకి వచ్చినట్టుంది.

దగ్గర్లో చింతచెట్టు కింద కూచున్న జనం ఐదారుగురొచ్చి 'నమస్కారం బాబయ్యా', 'నమస్కారాలు బాబయ్యా' అని కారులైటు వెలుతురులో కనిపిస్తున్న చౌదురిచుట్టూ చేరారు. వాళ్ళల్లో సుబ్బయ్యలేడు. అందరూ కొత్తవాళ్ల ఒక పేంటు కుర్రాడున్నాడు. మిగిలిన వాళ్ళంతా తలపాగాలు. నడుం చుట్టూ పంచెకట్టుకున్నవాళ్ళే. అలాంటి మనుషుల్ని గుంపుగా చూస్తే చౌదురికి అనుమానం. రెండేళ్ళకిందటయితే అక్కడికి అలాంటి సమయంలో చౌదురి రాలేదు. కలోలిత ప్రాంతాలుగా పేరు మోసాయి. ఇప్పటికీనీ, భూస్వాములు ఇళ్లువిడిచి పేదల ఇళ్ళలో తలదాచుకునేవాళ్లు. లేదా టౌన్‌లకిపోయి హోటల్స్‌లో ఉండేవాళ్లు. ప్రభుత్వం తీసుకున్న కట్టుదిట్టాల వలన పరిస్థితి ప్రస్తుతానికయితే అదుపులోకివచ్చింది. అయినా చౌదురిగుండె పీకుతూనే ఉంది. పెళ్ళిపేరుతో కుట్రకాదుకదా అన్న అనుమానం అక్కడదిగిన తర్వాత ముంచు